ప్రజాశక్తి
శుక్రవారం 13 అక్టోబరు 2023
5
శ్రీకాకుళం

అవినీతి వల్లే జైలుకు చంద్రబాబు : వైసిపి

జలుమూరు : స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫైబర్‌గ్రిడ్... ఇలా ప్రతిదాంట్లో అక్రమాలకు పాల్పడడం వల్లే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలు ఊచలు లెక్కపెడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని చల్లవానిపేటలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎవరు తప్పు చేసినా తప్పించుకోలేరనడానికి చంద్రబాబే పెద్ద ఉదాహరణ అని అన్నారు. చంద్రబాబు జైలుకెళ్లడానికి జగనే కారణమంటూ టిడిపి నాయకులు పచ్చి అబద్ధాలు చెప్తున్నారని తెలిపారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చెప్పారు. రూ.2.40 లక్షల కోట్లతో ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచారని కొనియాడారు. అందువల్లే మళ్లీ సిఎంగా జగనే కావాలని ప్రజలంతా బలంగా కోరుకుంటున్నారన్నారు.

- సొసైటీకి జమ కాని రుణాల సొమ్ము
- రూ.20 లక్షల వరకు ఉంటుందని అధికారుల గుర్తింపు
- రూ.కోటి పైబడి ఉంటుందని ప్రచారం
- బూర్జ పిఎసిఎస్‌లో అవకతవకల బాగోతం

పిఎసిఎస్ సొమ్ములు పక్కదారి



అధిక వడ్డీలు, ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల బెడద నుంచి రైతులను రక్షించాలన్నది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఎసిఎస్) ప్రధాన లక్ష్యం. రైతులకు రుణాల మంజూరు, వాటిని తిరిగి కట్టించుకునే విషయంలో కొన్నిచోట్ల జరుగుతున్న అవకతవకలు సంఘాల ప్రతిష్టనే దెబ్బతీస్తున్నాయి. రుణాలు ఇవ్వకుండానే రైతులకు నోటీసులు... వాయిదా సొమ్ములు చెల్లించినా, తిరిగి కట్టాలంటూ నోటీసులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. బూర్జ మండలంలోని బూర్జ పిఎసిఎస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలే ఇందుకు ఉదాహరణ. రైతుల రుణాల పేరిట లక్షలాది రూపాయల సొమ్ము పక్కదారి పట్టినట్లు తీవ్ర చర్చ సాగుతోంది. రుణాల సొమ్ము జమ కాని వైనంపై క్షేత్రస్థాయిలో 'ప్రజాశక్తి' పరిశీలనలో వెలుగు చూసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ పిఎసిఎస్ పరిధిలో 4,400 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ప్రతి ఏడాది 3,500 వరకు పంట రుణాలు పొందుతున్నారు. ప్రతి ఏడాది ఈ సొసైటీ పరిధిలో రూ.13 కోట్ల వరకు టర్నోవర్ ఉంది. 2014-15 వరకు ఆర్థిక లావాదేవీలు సక్రమంగా జరిగినా, ఆ తర్వాత మాత్రం గాడి తప్పిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రైతులకు జారీ చేస్తున్న నోటీసులతో సొసైటీలో జరుగుతున్న అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. రైతులు తాము తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించినా, కట్టలేదంటూ కొందరికి నోటీసులు ఇస్తున్నారు. వడ్డీ సొమ్ము చెల్లించలేదంటూ మరికొందరికి నోటీసులు ఇస్తున్నారు. రుణాలు తీసుకోని వారికి సైతం నోటీసులు ఇస్తుండడంతో వారు విస్తుపోతున్నారు. నోటీసులు అందుకుంటున్న రైతులు పిఎసిఎస్‌కు పరుగులు తీస్తున్నారు.

అవకతవకలకు ఉదాహరణలు ఇవే...

బూర్జ మండల కేంద్రానికి చెందిన సిహెచ్.కృష్ణమోహన్ 2020లో పంట ఖర్చుల కోసం రూ.20 వేలు రుణం తీసుకున్నారు. ఏడాదికోసారి రూ.1500 చొప్పున వడ్డీ చెల్లిస్తున్నారు. సకాలంలో వడ్డీ కడుతున్నా, అయన పేరుతో రూ.37 వేలు అప్పుగా రికార్డుల్లో ఉంది. అదే ప్రాంతానికి చెందిన సర్పంచ్, సొసైటీ మాజీ డైరెక్టర్ గంగు అప్పారావు రూ.10 వేలు, గంగు రవి రూ.60 వేలు, అదే కుటుంబానికి చెందిన గంగు భారతి రూ.60 వేలు 2017-18లో తీసుకున్నారు. అసలు, వడ్డీ కలిపి రూ.1.80 లక్షలు చెల్లించారు. అయినా మీరు రూ.20 వేలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడంతో వీరు ఆశ్చర్యపోతున్నారు. ఉవ్వపేటకు చెందిన పోతిన భాస్కరరావు 2018-19లో రూ.1,51,975 అప్పు తీసుకుని ప్రతి ఏడాది రూ.25 వేలు చెల్లిస్తున్నా, అసలుతో పాటు 5,829లు బకాయి పడినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. పోతిన శ్రీనివాసరావు రూ.21,523 అప్పు తీసుకోగా, అప్పుతో పాటు రూ.826 వడ్డీ చెల్లించాలని పేర్కొన్నారు. బొల్లి చిన్నమ్మడు రూ90,760 రుణంతో పాటు రూ.3,480 చెల్లించాలన్నట్లుగా నోటీసులు ఇచ్చారు.

పాస్‌బుక్‌లో అధికంగా రుణం పేర్కొన్నట్లుగా చూపిస్తున్న భాస్కరరావు

రూ.21 వేలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు

నేను, మా కుటుంబసభ్యులు కలిసి పంట కోసం రుణం తీసుకున్నాం. అసలు, వడ్డీ అంతా కలిపి చెల్లించినా డబ్బులు కట్టాలంటూ నోటీసులు ఇచ్చారు. సొసైటీలో మా పేరుతో ఉన్న అప్పుకు, మేం చెల్లించిన సొమ్ముకు రూ.21 వేలు తేడా కనిపిస్తోంది. అంతా కట్టేసిన తర్వాత మా పేరుతో అప్పు ఎందుకు చూపిస్తున్నారో అడగడానికి సొసైటీకి వచ్చాను.

- ఫణుకు గంగాధర్, చిన్నకురుంపేట

వడ్డీ చెల్లించినా కట్టాలంటున్నారు

నేను పంట ఖర్చుల కోసం 2015-16లో రూ.43 వేలు రుణం తీసుకున్నాను. ప్రతి ఏడాది వడ్డీ సొమ్ము చెల్లిస్తున్నాను. అయినా వడ్డీ డబ్బులు రూ.తొమ్మిది వేలు చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు.

- బొల్లి పాపారావు, ఉవ్వపేట

సొసైటీలో అవకతవకలు గుర్తించాం

సొసైటీలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రతి రైతు ఖాతానూ పరిశీలిస్తున్నాం. ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు ప్రాథమికంగా గుర్తించాం. డబ్బులు చెల్లించినట్లు రైతులు చెప్తున్నారు. అందుకు సంబంధించిన రశీదులు చూపిస్తే, వారు తిరిగి కట్టనవసరం లేదు.

- డి.వరప్రసాద్, సిఇఒ, డిసిసిబి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్షాల నాయకులు

ఆదేశాలు మోడీవి... అమలు జగన్‌వి

- పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి
- 16న ఇపిడిసిఎల్ ఎస్‌ఇ కార్యాలయం వద్ద ధర్నా
- సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గోవిందరావు, శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలపై భారాలను మోపే విధానాలను ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశిస్తే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి విమర్శించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఈనెల 16వ తేదీన ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తోందని విమర్శించారు.

మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ ప్రయోజనాలు తప్ప సామాన్యుల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పులకు అనుమతి ఇచ్చేది లేదని బెదిరిస్తోందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ, ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని విమర్శించారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ భారాలు వేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యుత్ ఛార్జీల పెంపు, శ్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూఅప్, ఇంధన, సర్‌ఛార్జీలు, కస్టమర్, ఫిక్స్‌డ్, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం పెంపు పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై మోపిందని వివరించారు. బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్‌శాఖ చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు ఛార్జీల భారాలను రద్దు చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వామపక్షాల నాయకులు డోల శంకరరావు, శ్రీనివాసులు, చిక్కాల గోవిందరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ తాగునీరు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస, పొందూరు

ప్రతి గడపకూ తాగునీరు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలంలోని వెదుళ్లవలస, కట్యాచార్యులపేటలో సుమారు రూ.81.64 లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పొందూరు మండలం సింగూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అందజేసిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళలు మంచినీటి కోసం పడుతున్న ఇక్కట్లను చూసి చలించి గ్రామాల్లోని మహిళలకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో సింహ భాగం జల్ జీవన్ మిషన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సిఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పొందూరు జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఆమదాలవలస ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, వైసిపి పొందూరు మండల అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, సర్పంచ్‌లు సురేష్, ఎన్ని రామచంద్రరావు, చంద్రమణి, మెట్ట శ్యామలరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

ధర్నా చేస్తున్న మత్స్యకారులు

రొయ్యల చెరువులతో తీరని నష్టం

తొలగించాలని బాధిత గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేట, పుక్కళ్లవానిపేటకు ఆనుకుని ఉన్న రొయ్యల చెరువులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామాల మత్స్యకారులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ రొయ్యల చెరువులతో గ్రామాల్లో మంచినీటి బావులు ఉప్పునీరుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువుల నీరు సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల మత్స్యసంపద మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సముద్రానికి 500 మీటర్ల లోపు రొయ్యల చెరువులు ఉండకూడదన్న నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు.

మత్స్యకారులకు పెద్దఎత్తున నష్టం వాటిల్లుతున్నా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఈ చెరువుల వల్ల నష్టాన్ని మత్స్యకారులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మంచినీటి చెరువుకు 15 మీటర్ల దూరంలో రొయ్యల చెరువులు తవ్వారని తెలిపారు. తక్షణమే ఈ ప్రాంతాల్లో రొయ్యలు, చేపల చెరువులను తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మత్స్యకార నాయకులు మైలపల్లి నర్సింగరావు, సూర్యనారాయణ, బర్రి కృష్ణ, సర్పంచ్ బర్రి రామారావు, ఎంపిటిసి చీకటి అమ్మోజీరావు, వైస్ ప్రెసిడెంట్ పుక్కల రామారావు, గనగళ్ల కామయ్య, మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఇటీవల వెలువడిన ఫార్మాసిస్టు, ఎఫ్ఎన్ఒ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టు srikakulam.gov in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు మెరిట్ జాబితాపై సందేహాలు ఉంటే ఈనెల 16వ తేదీ లోగా అభ్యంతరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. నేరుగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

దసరాకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దసరా పండగ నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి హైదరాబాద్, విజయవాడకు సాధారణ ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌ఛార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలసూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు ఈనెల 19, 20వ తేదీల్లో సాయంత్రం నాలుగు గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సర్వీసులకు apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం ఉందని పేర్కొన్నారు.

ప్రయాణికులు రెండువైపులా ఒకేసారి టిక్కెట్లు కొనుగోలు చేస్తే పది శాతం రాయితీ పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయదశమి సందర్భంగా విజయవాడ దుర్గాదేవి ఆలయానికి వెళ్లే యాత్రికుల కోసం ప్రత్యేక బస్సులు అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సాధారణ ఛార్జీలతో రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, కొత్తూరు, పాలకొండ, పాతపట్నం మార్గాల్లో అదనపు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పోస్టాఫీసులో ఆధార్ మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆధార్ మేళాను నిర్వహిస్తున్నట్లు హెడ్ పోస్టుమాస్టర్ దన్నాన చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో సవరణలు, మొబైల్ నంబరు, పేరు, అడ్రస్ వంటి మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. హెడ్ పోస్టాఫీసు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎమ్మెల్యే కృష్ణదాస్

ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా మూడో స్థానం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - జలుమూరు

జిల్లాలో 32,600 గృహ నిర్మాణాలతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచిందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లాస్థాయి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని మండలంలోని లింగాలవలస జగనన్న కాలనీలో గురువారం నిర్వహించారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి సందేశాన్ని తెరపై వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాల నిమిత్తం 1,79,690 ఎకరాలు అవసరం కాగా 1,22,717 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి, మిగతా 508.63 ఎకరాల మేరకు ప్రైవేటు భూమిని కొనుగోలు చేశామన్నారు. ఒక్క భూమి కొనుగోలు కోసమే రూ.178.31 కోట్లు వెచ్చించి జిల్లాలో 1.20 లక్షల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. జిల్లాలో సుమారు 700 లేఅవుట్లలో తాగునీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్, డ్రైనేజ్ వంటి పనులు చురుగ్గా చేపడుతున్నామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల సొంతింటి కల నేడు సాకారమైందన్నారు.

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే ఏకంగా 30.75 లక్షల ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కింద శరవేగంగా 21.76 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్మిస్తున్నవి ఇళ్లు కాదు.. ఊళ్లు అని అన్నారు.

అనంతరం కాలనీ నిర్మాణానికి సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ పీడీ ఎం.గణపతిరావు, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, ఎంపిపి వాన గోపి, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు కె.సీతారాం, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మరిన్ని మౌలిక వసతులు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

ప్రభుత్వాస్పత్రుల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించడంలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. మండలంలోని తూలుగులో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను పంపించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక కేటాయింపులు చేస్తోందన్నారు. నిధుల వెచ్చింపుల్లో ఎక్కడా వెనుకంజ వేయడం లేదని తెలిపారు. ఇప్పటికే రిమ్స్‌లో అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఆరోగ్య సురక్షలో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపిపి గొండు రఘురాం, జెడ్‌పిటిసి మార్పు సుజాత, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు పీస గోపి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

నెం. A384 తేది: 13-10-2023

దిగువ పేర్కొనబడిన నిర్మాణం కొరకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి బిడ్లు కోరబడు చున్నవి.
పనిపేరు : కొత్తకోట PACS Ground Floor & First Floor కోపరేటివ్ సహకార సంఘం రైతుల మీటింగ్ హాల్ నిర్మించుట కొరకు, సరుబుజ్జిలి.

1	అంచనా విలువ	రూ. 46 లక్షలలో
2	E.M.D	రూ. 46.077 లక్షలు
3	కాంట్రాక్టరు వ్యవధి	6 నెలలు
4	కాంట్రాక్టరు అర్హత	క్లాస్ 3 మరియు ఆపైన పనులకు సంబంధించి
5	షెడ్యూల్ బిడ్ ప్రారంభించు తేది	తేది 13-10-2023 ఉ॥ 10గం॥ల నుండి సా॥ 5గం॥ల వరకు PACS వేళల్లో
6	షెడ్యూల్ బిడ్ స్వీకరింపు ముగింపు తేది	తే॥ 19-10-2023 మధ్యాహ్నం 12 గం॥ ల వరకు
7	షెడ్యూల్ పరిశీలన తేది	తే॥ 20-10-2023 మధ్యాహ్నం 2 గం॥ ల వరకు
8	సాంకేతిక మరియు ఫైనాన్స్ బిడ్ తెరుచు తేది	తే॥ 20-10-2023 సాయంత్రం 4 గం॥ లకు

సంబంధిత అధికారి శ్రీ బి. వి. రామారావు, ముఖ్యకార్యనిర్వహణాధికారి,PACS కొత్తకోట పైన తెలుపబడిన పనుల యెక్క టెండర్ డాక్యుమెంట్ నిబంధనలు మరియు ఇతర వివరములను పొందుటకు ముఖ్య కార్యనిర్వహణాధికారి, PACS కొత్తకోట సంఘం మీద రూ.2000/-లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గాని, ఏదైన షెడ్యుల్ బ్యాంక్ లో గాని డిమాండ్ డ్రాఫ్ట్ (DD) తీసి కొత్తకోట పి.ఎ.సి.ఎస్ సహకార సంఘం నందు అందజేయగలరు. **ముఖ్య గమనిక:** ముఖ్యకార్యనిర్వహణాధికారి, PACS కొత్తకోట వారికి టెండరు భాగముల వారీగా విడదీయుట, వాయిదా వేయుటకు లేదా ఏ ఇతర కారణములు చూపించకుండా తిరస్కరించుటకు (లేదా) రద్దు చేయుటకు అధికారం కలదు.

సం/- బి.వి. రామారావు C.E.O,
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొత్తకోట పి.ఎ.సి.ఎస్, సరుబుజ్జిలి మండలం, శ్రీకాకుళం జిల్లా- 532190

మహారాజశ్రీ ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో OS 28/2021

Between:
గిరడ రమణమూర్తి --వాది
And:
భోగి జ్యోతి --ప్రతివాదులు

To,
భోగి జ్యోతి, తండ్రి లేటు వెంకటరమణ, కిలంతర గ్రామం,అల్లెన పంచాయితీ, బూర్జ మండలం, శ్రీకాకుళం జిల్లా.

యిందు మూలముగా తెలియజేయనదేమనగా మీ యొక్క హాజరు నిమిత్తం పై నెంబర్ దావా పై కోర్టులో **తేదీ 06-11-2023**కి వాయిదా అయి ఉన్నది. పై తేదిన **ఉ॥ 10.30 గం॥ లకు** మీరు స్వయంగా గాని లేదా మీ తరుపు లాయరు గారి ద్వారా గాని హాజరు కావలసి యున్నది.లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం. //

సాధు ధనుంజయరావు
న్యాయవాది,
ఆమదాలవలస,
ఫోన్: 9848521538.

పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

రాజపురం రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా రాజపురం వద్ద కంకర రోడ్డును సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదన్‌రావు కంకర మట్టి వల్ల పంట పొలాలకు జరగబోయే నష్టాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పరిశీలించి తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మధుసూదన్‌రావుతో కలసి సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కంకర రోడ్డుతో సుమారు ఆరు వేల ఎకరాలు ముంపునకు గురవుతాయని, తంపర మీద జీవనం సాగిస్తున్న రెండు వేల స్వదేశీ మత్స్యకారులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని మధుసూదన్‌రావు అధికారులకు వివరించారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ వెంటనే అడ్డంగా ఉన్న మట్టి రోడ్డును తొలగించాలని పోర్టు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, విశ్వసముద్ర అధికారులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

బోరుభద్ర విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- నౌపడ

జాతీయస్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో బోరుభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ గురువారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు డోకి వేదేశ్ భగవాన్ జోనల్ స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించి నగదు పురస్కారం, బంగారు పతకం, ప్రశంసాపత్రం పొందినట్టు చెప్పారు. అలాగే చెక్క సంధ్య, పాలిన ప్రవీణ్‌కుమార్, మామిడి హేమ, ఎన్ని తనుశ్రీ, సంకు వర్షిత్ జోనల్ స్థాయిలో మంచి ప్రతిభ చూపి బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు పొందారని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, బాడాన రాజు, ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, ఉమాదేవి, రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి, తవిటిరెడ్డి, జగదాంబ, రజని, శ్రీనివాసరావు, తిరుపతిరావు, శంకరరావు అభినందించారు.

ప్రజారోగ్యానికే 'ఆరోగ్య సురక్ష'

ఆమదాలవలస : వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంక్షేమ సాధికారతకై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిఎం వైఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పట్టణంలోని మొనింగివారి వీధిలో వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు శిబిరంలో స్పీకర్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని కట్యాచార్యులపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ తదనంతరం ప్రజారోగ్యంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆ దిశగా పేద ప్రజల ఆరోగ్య సంక్షేమానికి భద్రత, భరోసా కల్పించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఎంపిడిఒ ఎస్. వాసుదేవరావు, వైద్యులు ఎం.స్రవంతి, డి.సురేష్, సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె.మోహనరావు, వైసీపీ నాయకులు బి.రమేష్ కుమార్, ఎ.ఉమా మహేశ్వరరావు, డి.శ్యామలరావు, బి.రవి, కె.రామకృష్ణ, సిహెచ్ వెంకటరమణ, ఎస్.చిరంజీవి, ఎం.రమేష్, వై.విశ్వనాథం, వార్డు సచివాలయాల, మునిసిపల్, మెప్మా, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని రణస్థలం-1 సచివాలయం పరిధిలోని గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు కృష్ణచైతన్య, రజని, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పొందూరు: మండలం లయిదాంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 340 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మెన్ బాడాన సునీల్‌కుమార్, నాయకులు గాడు నాగరాజు, బండారు జైప్రతాప్ కుమార్, జమ్మునాయుడు, వైద్యాధికారులు సాగరిక, శివశంకర్, ఉదయ్ కుమార్, నిర్మలా అలెగ్జాండర్, సిహెచ్ఒ సుగుణమ్మ, హెచ్ఎస్ గౌరు నాయుడు, హెచ్ఇ స్వాతి, ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో అల్లన గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జెడ్‌పిటిసి బి.రామారావు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరరావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు ఎంపిపి ప్రతినిధి కె. నాగేశ్వరరావు, జడ్డు రామానంద్, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాం బాబు, వైస్ ఎంపిపి కె.కృష్ణం నాయుడు, తహశీల్దార్ రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, వైద్యులు రాజశేఖర్, పావని, రోజా, గౌతమి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని తాళ్లవలస సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కుప్పలి సురేష్‌కుమార్, మాజీ ఎంపిపి డి.రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, సర్పంచ్ ప్రతినిధి దేశెట్టి తిరుపతిరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు పాల్గొన్నారు.

పోలాకి : ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే కృష్ణదాస్ అన్నారు. మబగాం సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం తమ సంక్షేమమని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎంపిడిఒ ఉషశ్రీ, డిటి శ్రీనివాసరావు, వైద్యులు శ్రీనాథ్, రత్నం రాజు, విస్తీర్ణ అధికారి ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుతో ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి గ్రామ పంచాయతీ సచివాలయం 4లో సర్పంచ్ గొండెలి సుజాత ఆధ్వర్యాన నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌ను, డ్వాక్రా వస్తు ప్రదర్శనను పరిశీలించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు. తహశీల్దార్ తహశీల్దార్ ప్రవల్లికాప్రియ, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, ఎంపిటిసిలు పీత హేమలత, కూన పార్వతి, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని బాలకృష్ణాపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిపి బోర పుష్పలు ప్రారంభించారు. కార్యక్రమంలో కె.మోహనరావు, బతకల మోహన్‌దాస్, చిట్టి బాబు, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి ఆధ్వర్యాన ఆరోగ్య సురక్షను నిర్వహించారు. జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి చింతాడ చిన్నారావు, వడ్డీవాడ సర్పంచ్ గూడ్ల మల్లేశ్వరరావు, ఎంపిటిసి శిమ్మ సోమేష్ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని శిలగాంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ ప్రతినిధి కడియాల బాబూరావు, యువ నాయకుడు నర్తు శివాజీ, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, గొర్లెపాడు సర్పంచ్ కె.వల్లభరావు, ఎఎంసి చైర్మన్ బాబూరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, బదకల భాస్కరరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని పెద్దబాణాపురంలో సర్పంచ్ ప్రతినిధి పైల రమేష్ నాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన ఆరోగ్య సురక్షణష్త ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం, ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, డ్వాక్రా వస్తు ప్రదర్శనను పరిశీలించారు. వృద్ధులకు కళ్లద్దాలు, రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్కలి డిఎల్‌డిఒ అలివేలుమంగమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, తతహశీల్దార్ పద్మావతి, వైద్యాధికారులు అంజలి, అనితకుమారి, ఇఒపిఆర్‌డి రాజారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీలోని హట్కో కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, కౌన్సిలర్లు సింహాచలం, కో-ఆప్షన్ సభ్యులు, ఆర్.శ్రీనివాసరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మండలంలోని తర్లాకోటలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో 256 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, వైద్యాధికారులు సునీల్‌కుమార్, చిన్నంనాయుడు, అంజలి, సర్పంచ్ కొర్ల సంతోష్‌కుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, సచివాలయం మండల కన్వీనర్ దువ్వాడ రవి కుమార్ పాల్గొన్నారు. అలాగే

మెళియాపుట్టి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని పరశురామపురంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు ఆధ్వర్యాన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హేమంతలక్ష్మి, పావని, హరీష్, వాసుదేవ్, ఈశ్వరరావు, కార్యదర్శి శివాజీ, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని కొత్తపేటలో సర్పంచ్ అంబటి శ్రీను ఆధ్వర్యాన నిర్వహించిన ఆరోగ్య సురక్షలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిని శ్రీనివాసరావు పాల్గొని రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాకయ్య, సర్పంచ్‌లు అట్టడ గోవిందరావు, చింత రాజు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి తిరుమల రావు, గోవిందపురం పిఎస్‌సి వైద్యులు ప్రత్యూష, సుధీర్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేటలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతి రావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.నీరజ, మనీష, ప్రీతి, జోత్స్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 300 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కొత్తూరు : మండలంలోని ఆరోగ్య సురక్షలో 20 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారని ఆప్తలమిక్ వైద్యాధికారి ఇప్పిలి జానకిరామయ్య తెలిపారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు బస్సులో పంపించామన్నారు. కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ టి.రామారావు, పొగిరి రవి, బి.సాయి, సుమన్ పాల్గొన్నారు.

పోలాకి : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నౌపడ : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వసంతరెడ్డి

బూర్జ : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హామీలన్నీ అమలు

ఇచ్ఛాపురం: సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరయా సాయిరాజ్ అన్నారు. మండలంలోని టి.బరంపురం పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసా ద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వ రరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కంచిలి ఎంపిపి పైల దేవదా స్‌రెడ్డి, కవిటి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.బాబూ రావు, మండల అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, సర్పంచ్ కారంగి త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న సాయిరాజ్

గొండు శంకర్ పాదయాత్ర

సింహాచలానికి పాదయాత్రగా వెళ్తున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరశిస్తూ జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అరసవల్లి నుంచి సింహాచలం వరకు పాదయాత్రను గురువారం చేపట్టారు. చంద్రబాబు నిర్దోషిగా విడుదల కావాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన అక్కడినుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. సుమారు 100 కిలోమీటర్లు ఈ పాదయాత్ర సాగుతుంది. పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో తనకేమీ సంబంధం లేదని సిఎం జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అరెస్టు, నిర్బంధం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనన్నారు.

పాదయాత్రలో పార్టీ నాయకులు రెడ్డి గిరిజా శంకర్, పాత్రుని వలస మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పల నాయుడు, తెలుగు యువత కార్యదర్శి గొండు శ్యామ్, సుందరరావు, మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, మట్టా నందు, రుప్ప రమణమూర్తి, గురుగు లక్ష్మణ, ఎండు చిన్నారావు, బొల్ల నాగేంద్ర యాదవ్, యాళ్ల నాగరాజు, పొదిలపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావుకు సన్మానం

ప్రజాశక్తి- సోంపేట

గణితం సులువుగా నేర్చుకునేందుకు గణిత దశావదాన ప్రక్రియ ఉపయోగపడుతుందని ఇసుకలపాలెం పాఠశాల హెచ్‌ఎం ధర్మారావు అన్నారు. స్థానిక పాఠశాలలో గణిత అష్టావధాని మడ్డు తిరుపతిరావుతో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణితం సులువుగా అవగాహన చేసుకునేందుకు వివిధ ప్రక్రియలను గురించి అవధాని వివరించారు. అలాగే విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా అష్టావధాన్ని తిరుపతిరావును ఉపాధ్యాయులు ప్రసాద్, మురళి, కూర్మారావు, రవి, మనిషా తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రకాశరావుకు పరామర్శ

లావేరు : లావేరు మాజీ జెడ్‌పిటిసి, టిడిపి సీనియర్ నాయకులు కేసవరాయనిపాలెం గ్రామానికి చెందిన రాజా పంతుల ప్రకాశరావును ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, బల్లాడా జనార్దన్ గురువారం పరామర్శించారు. ప్రకాశరావు తల్లి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వీరితో పాటు వైసిపి నాయకులు జరుగుళ్ల శంకరరావు, మురపాక ఎంపిటిసి తేనెల సురేష్ కుమార్, పతివాడ గురునాయుడు ఉన్నారు.

శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

ముగిసిన వృత్తి శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మూడో రోజు పుట్టగొడుగుల శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యాన ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులకు నిర్వహించారు. చివర రోజున వరిగడ్డి కట్టలను కట్టలను క్రిమిరహితం చేయడం, బెడ్లను అమర్చే విధానం, యాజమాన్యం, ప్యాకింగ్, మార్కెటింగ్‌పై వివరించారు. రిసోర్స్ పర్సన్ భరద్వాజ్ ఆర్థిక సహాయ, సహకారాలు ఎలా పొందాలో తెలియజేశారు. పుట్టగొడుగులు కలుషితమయ్యే వాటిని ఎలా గుర్తించాలో వీటికి పాటించాల్సిన నియమాలను సూచించారు. ముఖ్యఅతిథి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి మాట్లాడుతూ శిక్షణ అనంతరం తిరిగి వారు పుట్టగొడుగులను పెంచడంలో ప్రావీణ్యం సంపాదించి విజయవంతంగా ఉపాధి అవకాశాలు ఇంటి నుంచే సులువుగా చేసుకో వచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ బి.మౌనిక, శిల్ప, రిసోర్స్‌పర్సన్ రాజేష్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి పెంపొందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఘనంగా కాన్వస్నేషన్ గురువారం నిర్వహించారు. ఈ సంవత్సరంలో ఉత్తీర్ణులైన వివిధ ట్రేడ్లకు చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పురపాలక సంఘం మాజీ వైస్ చైర్ పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేసి మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటిఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ రంగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైయివేటు సంస్థల్లో ఉద్యోగాలను సాధించవచ్చునన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత మంచి ఉద్యోగాన్ని సాధించి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ కూన బానోజీరావు, ప్రిన్సిపాల్ వరప్రసాదరావు, ఉపాధ్యాయులు నాగభూషణం, కృష్ణంరాజు, సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న కార్తీక్

ఆమదాలవలస : మెమొంటోను అందిస్తున్న వెంకట రాజ్యలక్ష్మి

టెక్కలి రూరల్ : నైపుణాభివృద్ధిని పెంపొందించి ఉన్నత శిఖరాలకు వెళ్లినప్పుడే విద్యార్థితో పాటు కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు వస్తాయని కరస్పాండెంట్ సత్తారు మన్మథరావు అన్నారు. శ్రీషిరిడి సాయి ప్రయివేట్ ఐటిఐ కళాశాలలో గురువారం ఘనంగా కాన్వకేషన్ శరమని (ధ్రువపత్రాల ప్రదానోత్సవం) నిర్వహించారు. టెక్కలి ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎ.కార్తిక్ చేతులు మీదుగా విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాలలోని ఇన్స్ట్రక్టర్లు సహచర సిబ్బంది పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి యువ క్లబ్‌లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను తెలియజేసి వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు యువ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భవిత పాఠశాలలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాగా పేర్కొంటున్న శ్రీకాకుళం జిల్లాలో 114 చారిత్రాత్మక ప్రదేశాలు, 67 బీచ్‌లు ఉన్నాయని తెలిపారు. వీటి ప్రాధాన్యతను అందరికీ తెలిసేలా యువ క్లబ్‌లు పనిచేస్తాయన్నారు. ఒక్కో యువ క్లబ్‌లో 30 మంది వరకు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను నియమిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పర్యాటక శాఖ కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎన్ స్వామి, పర్యాటక శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్.ఈశ్వరరావు, భవిత పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధర్‌రావు, ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కళాశాల పాఠశాల ప్రిన్సిపాల్, హెచ్ఎంలకు జిల్లా పర్యాటక శాఖ అధికారి యువక్లబ్‌లకు సంబంధించిన ధృవపత్రాలను అందజేశారు.

ధ్రువపత్రాన్ని అందజేస్తున్న నారాయణరావు

పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు

నరసన్నపేట : నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నరసన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన డ్రీం అండ్ డేర్ అనే అంశంపై విద్యార్థులకు గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ చిత్రలేఖనాలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రకటించారు. విజేతల వివరాలను లయన్స్ రీజియన్ స్థాయికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదాశివుని కృష్ణ, సెక్రెటరీ వి.నాగరాజు, కోశాధికారి, పొట్నూరు రమేష్, ప్రతినిధులు, సాయి శ్రీనివాస్‌శర్మ, కె.సాయిరాం, జోన్ చైర్మన్ రంగనాథ్, పాఠశాల హెచ్‌ఎం పి.వెంకట పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఐదుగురు అరెస్టు

మెళియాపుట్టి : మండలంలో ముకుందపురం పంచాయతీ పరుశురాంపురంలో ఈనెల 9న మృతి కేసులో ఐదుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు ఎఎస్ఐ నరసింగరావు తెలిపారు. అనుమానాస్పద స్థితిలో జన్ని అశ్విని (21) మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం దిశ డిఎస్‌పి వాసుదేవ్ కేసు దర్యాప్తు చేపట్టారని అన్నారు. వరకట్నం వేధింపుల కారణంగా మృతి చెందినట్లు దర్యాప్తులో తేలడంతో ఆమె భర్త జన్ని కృష్ణరావు, కుటుంబ సభ్యులు తులసమ్మ, పుచ్చయ్య, జి.ఆదిలక్ష్మి, జి.శ్రీదేవిలను అరెస్టు చేసి కోర్టులో హాజపరిచామని అన్నారు. కోర్టుకు రిమాండ్ విధించడంతో పాతపట్నం సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

బూర్జ : మండలం డొంకలపర్త పంచాయితీ పరిధిలో ఏటొడ్డుపర్త గ్రామానికి చెందిన మక్క అప్పలనాయుడుకు చెందిన రెండు ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతు లబోదిబో మంటున్నాడు. విషయం తెలుసుకొని జిల్లా విఆర్ఒల సంఘ అధ్యక్షులు రమేష్ బాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రజ వెళ్లి పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు అప్పలనాయుడు కోరారు.

రేపు అవగాహనా సదస్సు

నరసన్నపేట : నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాలలో శనివారం సివిల్స్ పరీక్షల్లో హిస్టరీ ఆప్షనల్‌పై ఉచిత అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ సిలబస్, సన్నద్ధత, ప్రణాళిక, నోట్స్ మేకింగ్, సమయ పాలన వంటి అంశాలపై సంబంధిత సబ్జెక్టు నిపుణులు డాక్టర్ మాకేన సతీష్ సమగ్ర అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9393929359 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఇంటింటికీ 'బాబుతో నేను'

శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్లను అందజేస్తున్న లక్ష్మీదేవి

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్-3లో బాబుతో నేను కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. రాష్ట్రంలో అరాచకాలకు అదుపు లేదని, ఓటుతో బుద్ధి సిఎం జగన్‌కు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అదపాక శంకరరావు, మాజీ సర్పంచ్ గోవిందరావు, పి.మోహనరావు, ఎన్.అచ్యుతరావు, మల్లా సీతారాం పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలం గనగళ్లవానిపేటలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సీర రమణయ్య, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతూ సుధాకర్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, సర్పంచ్ బర్రి రామారావు, ఎంపిటిసి అమ్మోజీరావు, సురేష్, కామయ్య, గురుమూర్తి, త్రినాధ్, అప్పలస్వామి, కృష్ణ, తాతారావు, రాములు, తోటయ్య, వైస్ ప్రెసిడెంట్ రామారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే ఇంటింటికీ వెళ్లి టిడిపి నేతలు అవగాహన కల్పిస్తున్నామని నాయకులు రేయ్ జానకిరామ్ అన్నారు. అందులో భాగంగా గురువారం 13వ వార్డు బెల్లుపడలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. 9261292612 ఫోన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లోపింటి తారకేసు, రెయ్యి బాసు. అనపన శ్రీను, రేయ్ ధర్మ, యు.లోహి, ఎస్.రమణ, యు.ముని, ఎస్.వీరమ్మ పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు పద్మనాభపురం, జయ రామచంద్రపురం ప్రాంతాల్లో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సవర రాంబాబు, కొండే నర్సింహులు, పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని భగవన్‌దాస్‌లో బాబుతో నేను అనే కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, మహిళా మండలి అధ్యక్షులు మెండ దమయంతి, మామిడి రాము, పోలాకి షణ్ముకరావు, హనుమంతు రామకృష్ణ, మట్ట సుందరమ్మ, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తం పాల్గొన్నారు.

పొందూరు: మండలం లోలుగులో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మోసపూరిత విధానాలను వివరించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకించి రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ లోలుగు వెంకట్, లావేటి జోగినాయుడు, చోళ్ల గోవిందరావు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పోస్టర్‌ను అందజేస్తున్న నూకరాజు

పొందూరు : పోస్టర్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

టెక్కలి : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ కక్షతోనే చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు అన్నారు. గురువారం మండలంలోని కనుగులవలస గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వైసిపి పాలనలోని ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారులను గోతులమయంగా చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పంచాయతీలకు నిధులు లేకుండా చేసి గ్రామ అభివృద్ధిని కుంటుపర్చారని ధ్వజమెత్తారు. వైసిపి పాలనలో అభివృద్ధి కనుమరుగైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ధరలు అదుపులో ఉండాలన్నా, విద్యార్థులకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబు నాయుడును సిఎం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిగిలిపల్లి కూర్మారావు, నూక అప్పయ్య, బెండి నాగేశ్వరరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

పరిశ్రమలశాఖ డీడీ ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహిస్తోందని జిల్లా పరిశ్రమలశాఖ డిప్యూటీ డైరక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం వాణిజ్య శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఎంటర్ ప్రైన్యూర్‌షిప్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు తమ చదువులు పూర్తయిన తరువాత తమకు ఆసక్తి ఉన్న ఇండస్ట్రీని నెలకొల్పోకోవచ్చనని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థినులు మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వాణిజ్య శాఖ విభాగాధిపతి ఎల్. కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థినులు పారిశ్రామిక వేత్తలుగా తయారైతే మరికొంత మందికి ఉపాధి కల్పించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, చరిత్ర విభాగధిపతి డాక్టర్ చిన్నారావు, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రభాకరరావు, వాణిశ్రీ, సంతోషి పట్నాయక్, లలితా బాయ్, ఇండస్ట్రియల్ ఎడి రఘునాథరావు, ఇండస్ట్రియల్ ప్రమోటర్ దిలీప్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడి తిరుమలరావు

సాగులో సలహాలు పాటించాలి

కోటబొమ్మాళి: ఖరీఫులో రైతులు సాగుచేస్తున్న వరితో పాటు కూరగాయల సాగులకు ఎరువులు, పురుగు మందులు, దోమపోటుకు సంబంధించిన మందులు వాడే ముందు స్థానిక వ్యవసాయాధికారులు సలహాలు తీసుకోవాలని టెక్కలి వ్యవసాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు. మండలంలోని హర్చింద్రపురంలో కొత్తమ్మతల్లి ఫార్మర్స్ ప్రొడ్యుసర్ కంపెనీ లిమిటెడ్ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రైతులు వచ్చే రబీ సీజన్‌లో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. పంట మార్పిడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి వ్యవసాయాధికారులు రంగరావు, ఎస్.గోవిందరావు, కొత్తమ్మతల్లి ఫార్మర్స్ ప్రొడ్యుసర్ కంపెనీ లిమిటెండ్ ఓనర్ పూజారి సత్యప్రియ, మేనేజర్ అప్పారావు, అర్టికల్చర్ అధికారి సునీత, అనూప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం

బిజెపి జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో బాధ్యతాయుతమైన మంత్రి పదవుల్లో ఉన్న వ్యక్తులు సభ్యత, సంస్కారాలను విడిచి ప్రవర్తిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని ప్రైవేటు హోటల్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతూ ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. పోలవరంపై ఎప్పుడు నోరు విప్పని మంత్రి అంబటి రాంబాబు సభ్యత కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. మహిళలంటే గౌరవం లేని వ్యక్తి మంత్రి పదవికే అనర్హుడన్నారు. కేంద్రం నుండి వచ్చే పంచాయతీ నిధులను సైతం మళ్లించి స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్న వైసిపి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. సమావేశంలో అట్టాడ రవి బాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, రావాడ పురుషోత్తం, ఎస్. వెంకటేశ్వరరావు, పి.సూర్యకుమారి, సీతరాజు, చెల్లయ్య, కరుణాకరరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజేష్

విద్యార్థికి తొలి గురువు తల్లి

కవిటి: విద్యార్థికి మొదటి గురువు తల్లేనని కళ్యాణి ఆంగ్ల పాఠశాల కరస్పాండెంట్ లోల్ల రాజేష్ అన్నారు. స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో గురువారం మాతృ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిని మించిన గురువు లేదని, తన సంతానం కోసం శ్రమించే ఏకైక వ్యక్తి తల్లిని అన్నారు. విశ్రాంత డిప్యూటీ డిఇఒ జానకిరామయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విలువలతో కూడిన విద్య అవసరమని, అది కళ్యాణి పాఠశాలలో నేర్పిస్తున్నారన్నారు. అనంతరం జానకిరామయ్య, పొందల జానకిరావుకి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ బిందుమాధవి, అకడమిక్ అబ్జర్వర్ బి.రాణి, వైస్ ప్రిన్సిపాల్ గీత, బి.రమేష్, సిఆర్‌పిలు తులసి, తనూజ పాల్గొన్నారు.

జిల్లేడు కషాయం పిచికారీ

ఆమదాలవలస: జిల్లేడు కషాయాన్ని పిచికారీ చేస్తున్న రైతు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా చేపేనపేట, నిమ్మతొర్లువాడ, జి.కెవలస, కొరపాం గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్దతిలో తయారు చేసుకున్న కాషాయాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంటల్లో పిచికారీ చేయించారు. ఈ సందర్భం గా ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి, డిజిటల్ ఎల్-2 సురేష్ మాట్లాడుతూ రైతులు వరి పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ల, ఉధృతిని నివారించడానికి పలు రకాల కషాయాలను తయారు చేయించి పిచికారీ చేయిస్తున్నామని అన్నారు.

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయ సేద్యానికి కషాయాలు అనుకూలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సీజనల్ ఎన్‌ఎఫ్‌ఎంటి సంజీవరావు అన్నారు. గొప్పిలి యూనిట్ మర్రిపాడు-కె పరిధి సంతోషపురంలో గురువారం క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం పలువురు రైతులకు తూటి కాడల (కంపెనీ ఆకుల) 20 లీటర్లు కషయాన్ని తయారు చేశారు. సుడిదోమ నివారణకు వాడే తూటికాడకు కావాల్సిన ముడి సరుకులు ముందుగా తూటి కాడల ఆకులు పది కేజీలు తీసుకొని అందులో 15 లీటర్ల ఆవు మూత్రంతో నాలుగు పొంగులు వచ్చేలా మరిగించి తర్వాత చల్లార్చి వడపోసి పంటలపై పిచికారీ చేసుకున్నట్లయితే వరి పంటలో సుడిదోమ నివారణకు త్వరగా మంచి ఫలితం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ట్రై కార్ రాష్ట్ర డైరెక్టర్ సవర ఈశ్వరి, ఎంపిటిసి మాజీ సభ్యులు సవర సుభాష్, నీలిమ, సంధ్యారాణి పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలో కమ్మ సిగడాం గ్రామంలో మన్నె రాంబాబు వరిలో ఆకు ముడత పురుగు గమనించడం జరిగిందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి సువ్వారి సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం

రణస్థలం: కషాయం తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

మెళియాపుట్టి: ద్రావణాన్ని తయారు చేస్తున్న రైతులు

వరిలో ఆకుముడత పురుగు నివారణ నిమిత్తం రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంచ పత్రి కషాయం తయారు చేసారు. ఒక ఎకరానికి ఈ పంచ పత్రి కషాయం తయారీకి కావలసిన పదార్థాలు వేపాకు ఒక కిలో, కానుగాకు ఒక కిలో, వావిలాకు ఒక కిలో, సీతాఫలం ఒక కిలో, నేరేడు ఒక కిలో చొప్పున ఐదు రకాల ఆకులను ఒక పాత్రలో వేసి అందులో పది లీటర్లు నీరు వేసి ఒక రాత్రి నానబెట్టి మరుచటి రోజు బాగా మరిగించి చల్లార్చిన తర్వాత ఆ వచ్చే ద్రావణంను ఒక ఎకరాకు సరిపడే నీటిలో కలుపుకొని పిచికారి చేసినట్లయితే ఆకుముడత పురుగు, రసం పీల్చే పురుగులను, చిన్న లార్వాలు, లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు, ఆకులు తినే మిడతలను సమర్థవంతంగా నిరోధించవచ్చునని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, గ్రామ కార్యకర్త గులివెందుల జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

కలుపుమందుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

కలుపు మందులు వాడకంపై రైతులకు సరైన అవగాహన ఉండాలని సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామమైన కొండవలసలో జాతీయ వరి పరిశోధనా స్థానం హైదరాబాద్ శాస్త్రవేత్తల బందం పర్యటించారు. వరిలో ప్రధాన సమస్య కలుపు నివారణ చర్యలపై రైతులతో ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలో తగు మోతాదులో తేమ ఉండే పరిస్థితుల్లోనే కలుపు మందులు వాడాలన్నారు. తగిన సమయం విత్తనం విత్తే ముందు, తరువాత వేయదగిన కలుపు మందుల వాడకంపై రైతులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ రకాల కలుపు మందులు కలిపి ఒకేసారి వాడడం వలన రైతుల నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ పద్మ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నందున సుడిదోమ ఆశించిన పైరుకు ఉధృతిని అనుసరించి శాస్త్రవేత్తల సూచనలు మేరకు పురుగు మందులు వాడకాన్ని చేపట్టాలని వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం రాగోలు ప్రధాన శాస్త్రవేత్త పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ సుడిదోమను తట్టుకునే రకాలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి అమర జ్యోతి, డాక్టర్ కె.మధు కుమార్, డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, డాక్టర్ ఉదయ్ బాబు, జి. శిల్ప, గ్రామ సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, అభ్యుదయ రైతు నీలంనాయుడు పలువురు రైతులు పాల్గొన్నారు.

కొండవలసలో పర్యటిస్తున్న శాస్త్రవేత్తల బృందం

అమృత కలశయాత్రను నిర్వహిస్తున్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటిలో కలశయాత్ర

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విద్యార్థులు జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఆజాద్‌కా అమృత్ మహోత్సవంలో భాగంగా అమృత కలశయాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్. పెద్దాడ జగదీశ్వరరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రకృతి ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డి ఎల్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ కె.మోహన్ కృష్ణచౌదరి, ఎఫ్‌ఒ డాక్టర్ అసిరినాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డా.పెద్దింటి ముకుంథరావు, పిఒలు డా.వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, ఆర్.మల్లీశ్వరి, డా.జి.ఈశ్వరరావు, డా.ఆర్.గణపతిరావు, డా.ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బంటుకొత్తూరు పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పంచాయితీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని జనసేన నియోజకవర్గం నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ఆరోపించారు. మండలంలోని బంటుకొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో జనసేన నాయకులు గురువారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి రోడ్లపై మురుగు నీరు ప్రవహిందని, దీనిని పంచాయతీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటితో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. తక్షణమే పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరారు. ఆయనతో పాటు జనసేన నాయకులు హరీష్‌కుమార్, దిలీప్‌కుమార్ ఉన్నారు.

మురుగునీటిని పరిశీలిస్తున్న దుర్గారావు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మందస

ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలలను గురువారం సందర్శించి ఆయా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, ఐటిడిఎ పరిధి పాఠశాలల్లో పీజీ హెచ్‌ఎం ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలని కోరారు. ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ పోస్టులను మంజూరు చేయకుండా ఉపాధ్యాయులకే అదనపు బాధ్యత ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో గవ్వ భీమారావు, నల్ల ఢిల్లీరావు, దున్న చంద్రశేఖర్, వి.వి.వరప్రసాద్, దువ్వు వైకుంఠరావు, ఎస్.ప్రభాకరరావు, పి.సత్యం, బి.రామారావు, డి.రామారావు, డి.మోహనరావులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న సుభాష్‌బాబు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న నారాయణరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే కుటుంబం బాగుంటుందని ఎపిఎం జి.నారాయణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘ లీడర్లకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిన్‌షన్ పేదరి నిర్మూలన సంస్థ దారా గురువారం శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారులు సంఘంలో కుటుంబంలో ఒక్కోరే సభ్యులుగా చేరాలన్నారు. ఒకే ప్రాంతంలో భూమి ఉన్న రైతులు ఒక సంఘంగా ఏర్పాటు చేయాలన్నారు. మెరుగైన ఉత్పత్తి పద్దతులు మార్కెట్ అవసరాలను బట్టి ఉత్పత్తి ప్రణాళిక చేసుకోవడం, ఉత్పత్తిని కలిసి, కలిసికట్టుగా అమ్ముకోవడం, ఉత్పత్తిదారులు సంఘాలు సభ్యులు ప్రగతికి కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అందించే పథకాలపై సభ్యులందరికీ అవగాహన కల్పించాలన్నారు. సంఘం పుస్తక నిర్వహణ, మంచి పరిజ్ఞానం ఉన్న వారినే సంఘం అధ్యక్షుడు ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో వరదరాజు, సిఒ కె.పద్మావతి. సిసిలు బి.నీలవేణి, పి.సరోజిని పాల్గొన్నారు.

కూలిన మామిడిచెట్టు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో కొల్లివలస జంక్షన్ సమీపంలో హనుమాన్ టెంపుల్ వద్ద శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులతో ఐదు దశబ్దాలు చరిత్ర ఉన్న మామిడి చెట్టు కూలిపోయింది. దీంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. గమనించిన అన్నంపేట గ్రామానికి చెందిన పరిడాల రవి చెట్టు కూలిన విషయం తెలుసుకొని స్థానికులతో కలిసి రహదారికి అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్ సమస్యను తొలగించారు. అరగంటసేపు రెవిన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానికులు సమాచారం ఇచ్చినా ఎవరు పట్టించుకోలేదని ప్రజలు వాపోయారు.

చెట్టును తొలగిస్తున్న స్థానికుడు

బిట్-3లోనే కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని వంశధార నిర్వాసితులను మెట్టూరు బిట్-3నే కొనసాగించాలని ఇరపాడు పంచాయతీ పెద్దమడి గ్రామస్తులు కోరారు. సర్పంచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం టెక్కలిలో నిర్వహించిన స్పందనలో డిఎల్‌పిఒ ఐ.రమణను కలిసి వినతిపత్రం అందజేశామని అన్నారు. బిట్-2లో భూ సేర్వే ప్రకారం నివాసం ఉన్నా.. బిట్-3 నుంచి అంగన్వాడీ, ఆశా కార్యకర్తల, వార్డు మెంబరు, జాబ్‌కార్డులు, పాన్ కార్డులు పొందుతున్నామని ఆయనకు వివరించామని తెలిపారు.

నగదును అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- బూర్జ

మండలం తోటవాడ గ్రామానికి చెందిన నేమాపు వెంకటరమణ(38) బుధవారం అనారోగ్యంతో మరణించారు. ఆయన భార్య లక్ష్మికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు సచివాలయాల మండల కన్వీనర్ గుమ్మడి రాంబాబు, స్థానిక సర్పంచ్ సుర ఆనంద్ అందించారు.. మరో రూ.9వేలు మృతుడి భార్య లక్ష్మీ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గేదెల జోగినాయుడు, డిజిటల్ అసిస్టెంట్ సులేమాన్ పాల్గొన్నారు.

'108'లో శిశువు జననం

పలాస: మందస మండలం తంగరపుట్టికు చెందిన సవర శ్యామలకు బుధవారం అర్ధరాత్రి సమయంలో 108 వాహనంలో మగ బిడ్డ జన్మనిచ్చింది. సవర శ్యామలకు ఎక్కువగా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. శ్యామలకు పలాస ప్రభుతాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అదే 108లో తీసుకువెళ్తుండగా పలాస జాతీయ రహదారి సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో ఇఆర్ సిపి వైద్యులు శ్రీకాంత్, సిబ్బంది సత్యం, ఎం.రామచంద్రారెడ్డి చాకచక్యంగా ప్రసవం చేయించారు. గర్భిణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు అందజేత

కోటబొమ్మాళి: విద్యార్థులు చిన్ననాటి నుంచి పోటీ పరీక్షలను అలవాటు చేసుకోని వారి ప్రతిభను కనబర్చుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు పోటీ పరీక్షల ద్వారానే భవిష్యత్ ఉంటుందని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గతేడాది నిర్వహించిన జాతీయస్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థాయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, షీల్డ్‌ను ఎంఇఒ ఎస్.అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, సెమ్స్ సంస్థ స్థాపకుడు శ్రీరెడ్డి ఆధ్వర్యాన గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెమ్స్ ఒలంపియాడ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

నగదును అందిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ

పలువురికి ఆర్థికసాయం

కవిటి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మాణిక్యపురానికి చెందిన అరవ్ బిసాయ్‌కు దాతలు అండగా నిలుస్తున్నారు. అరవ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బాధిత కుటుంబానికి గురువారం రూ.8 వేలు అందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న అరవ్‌కు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిరియా వేణు, వైకుంఠరావు, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని ముఖలింగాపురానికి చెందిన కె.సోమేశ్వరరావుకు నర్సింగపల్లికి చెందిన రాంబాబు ఛారిటబుల్ ట్రస్టు నుంచి రూ.5 వేలు నగదు అందజేశారు. సోమేశ్వరరావు చెట్టుపై నుంచి జారిపడి కాలు విరిగిపోవడంతో గాయపడ్డాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని నగదు అందజేశామని ట్రస్టు నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు.